క్లుప్తంగా

చెకుముకి పోటీల్లో ప్రతిభ

వాల్మీకిపురం: మండల వ్యాప్తంగా నిర్వహించిన చెకుముకి మండల స్థాయి పోటీలు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో నిర్వహించారు. ఈ పరీక్షలలో విజేతలుగా జిల్లా పరిషత్ పాఠశాల చింతపర్తి గ్రామం విద్యార్థులు తరుణ్ రెడ్డి, కీర్తన, హాస్నిక ప్రథమ స్థానంలో, పివిసి ప్రభుత్వ పాఠశాలకు చెందిన తేజేష్, నవ్యశ్రీ, మణితేజ ద్వితీయ స్థానంలో నిలిచారు. విద్యార్థులకు షీల్డ్‌లు, పతకాలు, ప్రశంసాపత్రలు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ప్రభుచరణ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి వారిలో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించేందుకే ప్రతి సంవత్సరం చెకుముకి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు సువర్ణదేవి, నాగరత్న, సుధారాణి, వేదవాణి, షఫి, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

బి.కొత్తకోట : కోళ్లఫారంపై దాడులు చేసిన పోలీసులు కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్న ఘటన గురువారం రాత్రి బి.కొత్తకోట మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు..గోళ్లపల్లె పంచాయతీ చీకుచెట్టుపల్లెకు చెందిన కోళ్లఫారంలో కర్ణాటక మద్యం నిల్వలు ఉంచారన్న అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించగా 1,152 టెట్రా ప్యాకెట్ల (103.6 లీటర్లు) మద్యం పట్టుబడింది. ఈ మద్యానికి సంబంధించిన నిందితులు ఆలీ, రమేష్‌బాబు, గణపతిలను అరెస్ట్‌చేసి మద్యం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సింగిల్‌విండో అధ్యక్షుడిగా నారే వెంకటరమణారెడ్డి



పీలేరు రూరల్ : సింగిల్‌విండో అధ్యక్షుడిగా నారే వెంకటరమణారెడ్డి నియమితులైనట్లు డీఆర్ శ్యాంప్రకాష్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. నారే వెంకటరమణారెడ్డి ఆదివారం సింగిల్‌విండో అధ్యక్షుడుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి హాజరవుతారని తెలిపారు. డైరెక్టర్లుగా స్టాంపుల మస్తాన్, తిమ్మయ్య కూడా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

ఇద్దరు జూదరుల అరెస్ట్

మదనపల్లె : కోడిపందెం ఆడుతున్న ఇద్దరు జూదరులను అరెస్ట్‌చేసినట్లు వన్‌టౌన్ సీఐ వలీ బాషు తెలిపారు. పట్టణంలోని మారుతీనగర్ సమీపంలో కోడిపందెం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడిచేశామన్నారు. దాడిలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రెండుకోళ్లు, రూ.1,050 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

సకాలంలో వైద్య సేవలు అందించాలి

తంబళ్లపల్లె: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి కోరారు. శుక్రవారం కోసువారిపల్లె పీహెచ్‌సీని సందర్శించారు. డాక్టర్ అనుపమ, వైద్య సిబ్బందితో సమావేశం జరిగింది. సిబ్బంది పనితీరు, అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రభుత్వ వైద్యసేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట సర్పంచు విజయలక్ష్మీ, నాయకులు శంకర్‌రెడ్డి, రఘు తదితరులు ఉన్నారు.

ఉచిత కంటి అద్దాలను సద్వినియోగం చేసుకోవాలి

కలకడ : ప్రభుత్వం ఉచితంగా అందించే కంటి అద్దాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలోని దేవులపల్లె-37మంది, కె.దొడ్డిపల్లె-31 మంది, కదిరాయచెర్వు-48, ముడియంవారిపల్లె-39మంది, దిగువపాళ్యం-53 మందికి కలిపి మొత్తం 208 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించి వారికి జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, పీహెచ్‌ఎన్ సుబ్బరత్నమ్మ, సిబ్బంది వెంకటేశ్వరరావు, రెడ్డెమ్మ, భారతమ్మ, షరీఫ్ బాష, అహమ్మద్, రమణమ్మ పాల్గొన్నారు.

పాదయాత్రకు మద్దతు

ములకలచెరువు: కట్ట పోగు బసవరావు ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన పాదయాత్ర శుక్రవారం ములకలచెరువు మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు పాదయాత్రకు మద్దతు పలికారు. వచ్చే ఎన్నికల్లో 175 సీట్లు సాధించి మళ్లీ వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ఈ పాదయాత్ర చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వైఎస్ జగన్ ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధే మళ్లీ అధికారంలోకి తెచ్చిపెడతాయన్నారు. అనంతరం ఆయనను మండల నాయకులు సన్మానించారు.

ఈవీఎంలపై అవగాహన

కలికిరి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని 189, 190, 191 పోలింగ్ స్టేషన్ల పరిధిలోని ఓటర్లకు సెక్టోరియల్ అధికారి నవీన్ రెడ్డి, బీఎల్‌ఓలు హరినాధ, శివకుమార్, రిషికుమార్‌లు ఈవీఎంలపై అవగాహన కల్పించారు.

హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డుపై ఆధ్యాత్మిక శోభ

- తిరుమలకొండ ఎత్తు 3,010 అడుగుల వద్ద శ్రీవారి పాదాల స్థూపం ఆవిష్కరణ
- ఎమ్మెల్యే, ఆర్డీఓ ప్రత్యేక పూజలు



స్థూప ఆవిష్కరణలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట: రాష్ట్రంలో ఏకైక వేసవి విడిది కేంద్రం, పర్వత నివాస ప్రాంతమైన బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డుపై శుక్రవారం ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. వేద పండితుల మంత్రోచ్చారణ, గోవింద నామస్మరణతో అటవీప్రాంతం మార్మోగింది. ప్రస్తుతం ఘాట్‌రోడ్డుపై ప్రయాణించే వారికి తిరుమలకొండ ఎత్తు వద్ద ఆధ్యాత్మిక వాతావరణం కనిపిస్తుంది. సముద్రమట్టానికి 4,141 అడుగుల ఎత్తులోని కొండపైకి కిందనుంచి పైకి వెళ్లేటప్పుడు నాలుగో మలుపు దాటిన కొద్ది దూరంలో రోడ్డు మోరీపైన ×ఇది తిరుమలకొండ ఎత్తు 3,010 అడుగులు అని రాసింది కనిపిస్తుంది. సరిగ్గా ఇక్కడే శ్రీవారి పాదాలను ఏర్పాటుచేసి తద్వారా ఆధ్యాత్మిక శోభను తీసుకొచ్చి, పర్యాటకుల్లో భక్తి భావం పెంపొందించాలని మదనపల్లె ఆర్డీఓ, హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ కమిటి చైర్మన్ ఎంఎస్.మురళీ నిర్ణయించారు. దీనిపై చర్యలు చేపట్టి మోరీపైనే స్థూపం నిర్మింపజేశారు. స్థూపం కింద రెండువైపులా శ్రీవారి పాదాలు, పైన గరుక్మంతుడి విగ్రహం ప్రతిష్టించారు.

వేడుకగా ఆవిష్కరణ

శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచే శ్రీవారి పాదాల స్థూపం ఆవిష్కరణ కార్యక్రమం మొదలైంది. ప్రత్యేక పూలతో స్థూపాన్ని అలంకరించారు. పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించగా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఆర్డీఓ మురళీ సతీసమేతంగా హాజరయ్యారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, పర్యాటకశాఖ సిబ్బంది, గ్రామస్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

ఆధ్యాత్మికతతో మెరుగైన సమాజం

ఆధ్యాత్మిక ప్రతిఒక్కరిలో మార్పు తీసుకొస్తుందని తద్వారా మెరుగైన సమాజం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. చిన్నతనం నుంచే గ్రంథాలను పఠింపజేయడం, ఆలయాల విశిష్టత, తద్వారా మనిషి మనుగడ, జీవితంలో ఆధ్యాత్మికతకు ఉన్న ప్రాధాన్యతను తల్లిదండ్రులు పిల్లలకు బోధించాలన్నారు. ఆలయాలకు వెళ్లడం, సంప్రదాయాలు పాటించడం ద్వారా గతానికి, భవిష్యత్ మధ్య వారధి కావాలన్నారు. ఆర్డీఓ మురళీ మాట్లాడుతూ ఆధ్యాత్మిక మనిషి మనుగడకు మూలమని, దీనివల్ల మనిషికి ఆత్మవిశ్వాసం పెరుగుతుందని చెప్పారు. ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడిచేందుకు సాధ్యమవుతుందని, దీన్ని అందరూ ఆచరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రఫీక్ అహ్మద్, ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్, రేంజర్ మదన్‌మోహన్‌రెడ్డి, సెక్షన్ ఆఫీసర్ అడపా శివకుమార్, ఎంపీడీఓ శంకరయ్య, టూరిజం మేనేజర్ నేదురుమల్లి సాల్వీన్‌రెడ్డి, మాజీ సర్పంచు సుదర్శన్ రెడ్డి, సొసైటీ కార్యదర్శి రాజారెడ్డి, మహేష్, విజయారెడ్డి, ధరణీ, సతీష్ పాల్గొన్నారు.

జగన్‌ను మరోసారి ఆశీర్వదించండి

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పాటుపడే ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి నిండు మనస్సుతో ఆశీర్వదించాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పీలేరు పట్టణంలోని వివేకానంద సర్కిల్, కోటపల్లె, నాగిరెడ్డి కాలనీ, రెడ్డి అండ్ రెడ్డి కాలనీలో విస్తృతంగా పర్యటించారు. ప్రభుత్వం అందించిన పథకాలు చదివి వినిపించడం తోపాటు ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ప్రజల నుంచి వచ్చిన సమస్యలు అప్పటికప్పుడు సంబంధిత అధికారులను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలో వందశాతం అమలు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా బలోపేతం చెందడమే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. గడప గడపకు కార్యక్రమంలో తాము ప్రజల వద్దకు వెళితే ప్రతి కుటుంబం సంతోషంతో కన్పిస్తోందని చెప్పారు. ప్రస్తుతం లభిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. టీడీపీ నాయకులు గతంలో 650 హామీలు ఇచ్చి అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం ఎవరూ మరచిపోలేదన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో మరోసారి ప్రజలను మభ్యపెడుతూ ఉచిత హామీలు ఇస్తున్నారని, ఎవరూ మోసపోరాదన్నారు. మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, జి.వి. రాకేష్‌రెడ్డి, జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, స్టాంపుల నరసింహారెడ్డి, జెడ్పీ కోఆప్టెడ్ సభ్యుడు షఫీ, ఏఎంసీ ఛైర్మన్ యల్లయ్య, డాక్టర్ హబీబ్‌బాషా, కృష్ణారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, ఎన్.వి. చలపతి, మహితాఆనంద్, రామ్ నరేష్‌రెడ్డి, అరుణ, సంజీవయ్య, భాస్కర్‌రెడ్డి, హుమయూన్, చంద్రారెడ్డి, అమరనాథరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, షపూరా తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ఆలయాలు ముస్తాబు



పీలేరు: వైకుంఠ ఏకాదశికి ముస్తాబైన వెంకటేశ్వరస్వామి ఆలయం



మదనపల్లె సిటీ: ప్రత్యేక అలంకరణలో ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయ ఉత్తర ద్వారం

పీలేరురూరల్ : వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయాలు ముస్తాబయ్యాయి. పట్టణంలోని కోటపల్లెలో శ్రీ పద్మావతి ఆండాల్ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, కడప రోడ్డు మార్గంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ముమ్మర ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయాల చైర్మన్లు మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, రిటైర్డ్ ఏఎస్పీ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఆలయాల్లో శనివారం ఉదయం 4 గంటల నుంచి వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ద్వాదశి దర్శనం ఉంటుందన్నారు.

ముక్కోటికి వెంకన్న ఆలయం ..

మదనపల్లె సిటీ: ముక్కోటి ఏకాదశికి మదనపల్లె పట్టణంలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం ముస్తాబు చేశారు. ఆలయంలో ఉత్తర ద్వారంకు ప్రత్యేక అలంకరణ చేశారు. ఏడు ద్వారాలను ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం 4 గంటల నుంచి భక్తులకు ఉత్తరద్వారం ద్వారా దర్శనం కల్పించనున్నట్లు ఈఓ రమణ భక్తుల కోసం క్యూ ఏర్పాటు చేశారు. ఉదయం స్వామికి అభిషేకాలు, గోదాదేవి పూజలు చేసి ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనం కల్పిస్తారు. ఆలయాన్ని వివిధ పుష్పాలతో అలంకరించారు. దీంతో పాటు శ్రీవారి నగర్‌లోని లక్ష్మి నరసింహస్వామి ఆలయం, బీటీ కాలైజీ మైదానం వద్దనున్న వరాల ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అధికారుల తీరుపై నిరసన

బి.కొత్తకోట: సమస్యలపై కలెక్టర్, తహసీల్దార్లకు వినతిపత్రాలు ఇచ్చినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని బి.కొత్తకోట ఎంపీపీ లక్ష్మినరసమ్మ ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో నేలపై బైఠాయించి నిరసన తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రఫీక్ అహ్మద్ అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశం జరుగుతుండగా వేదికపై కూర్చున్న ఎంపీపీ లక్ష్మినరసమ్మ తన వినతులను పట్టించుకోవడం లేదని కింద కూర్చుని నిరసన తెలిపారు. అంబేడ్కర్ భవన్, పేదలకు ఇంటిస్థలాల కోసం వినతులు ఇచ్చానని ఏడాది గడచినా పట్టించుకోలేదని చెప్పారు. ఆమెకు పలు దళిత సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై తహసీల్దార్ రఫీక్ అహ్మద్ స్పందిస్తూ వినతులపై శనివారం పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. సమావేశంలో కమిషనర్ పీఆర్.మనోహర్, ఏఓ థామస్‌రాజ్, మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యులు కేవీ.రమణ, సంఘాల ప్రతినిధులు సింగన్న, సచిన్, నరసింహులు, పలక వెంకటేష్, రవీంద్ర, కాంతారావు, సబ్జీ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలో 1.36 లక్షల రికవరీ



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

వాల్మీకిపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన సామాజిక తనిఖీలో రూ.1,36,215 రికవరీకి ఆదేశించినట్లు డ్వామా పీడీ మద్దిలేటి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ క్రింద 2031 పనులు చేయడం జరిగిందని, ఇందులో హార్టికల్చర్, వైఎస్సార్ హౌసింగ్, ఫారంపాండ్స్, తదితర వర్కులకు గానూ రూ.6,91,84,335, మెటీరియల్‌కు రూ.1,03,894లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. ఈ పనులలో అవకతవకలు జరిగాయని సోషల్ ఆడిట్ సిబ్బంది బయట పెట్టడంతో అందులకు వారి నుండి రూ.1,36,215లను రికవరీ చేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ నందకుమార్, డీవీపీ ప్రకాష్, ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, ఏపీవో ప్రసాద్ బాబు, ఎస్‌ఆర్‌పి చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

దళిత సామాజిక ఉద్యమనేత పి.వి.రావు



పి.వి.రావు వర్ధంతి సందర్భంగా నివాళి అర్పిస్తున్న మాలమహానాడు నాయకులు

మదనపల్లె : మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు పోతుల విష్ణ్వేశ్వరరావు(పి.వి.రావు) దళిత సామాజిక ఉద్యమకారుడిగా చరిత్రలో నిలిచిపోయారని ఆ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం అన్నారు. పి.వి.రావు 18వ వర్ధంతి సందర్భంగా గురువారం మాలమహానాడు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాలల సమగ్ర అభివృద్ధి కోసం ఉద్యమంలో ప్రాణాలు విడిచిన త్యాగశీలి, అంబేడ్కర్ వాది, మాలజాతి ముద్దుబిడ్డ పి.వి.రావు అని కొనియాడారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు యమలాచంద్రయ్య, గుండామనోహర్, మల్లెలమోహన్, రామచంద్ర, జీవన్, శ్రీరాములు, అప్పయ్య, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు 1600 మందికి ఇంటి పట్టాలు



ఇంటి పట్టాల పంపిణీకి సిద్ధం చేస్తున్న తహసీల్దార్ ధనుంజయలు

పీలేరు రూరల్ : పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో నాలుగో విడత పీలేరులో పట్టణంలో 1600 మంది లబ్ధిదారులకు శనివారం ఎంఎస్‌ఆర్ కల్యాణమండపంలో లక్కీడిప్ పద్ధతిలో ఇంటి ప్లాట్లు కేటాయించడం జరుగుతుందని తహసీల్దార్ ధనుంజయలు తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో కొత్తగా మంజూరైన లబ్ధిదారుల వివరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్కీడిప్ ద్వారా ప్లాట్లు కేటాయించడానికి 8 కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇది వరకే మూడో విడత ఏపీఐఐసీ లేఅవుట్‌లో 1700 మందికి లక్కీడిప్ ద్వారా ప్లాట్లు కేటాయించడం జరిగిందన్నారు. మూడో విడత, నాలుగో విడత కలిపి మొత్తం 3300 మంది లబ్ధిదారులకు ఆదివారం ఏపీఐఐసీ లేఅవుట్ వద్ద రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ఇంజినీరింగ్ విద్యార్థికి గోల్డ్‌మెడల్

మదనపల్లె సిటీ: స్థానిక చిత్తూరురోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ ఇంజినీరింగ్ విద్యార్థి మయినా సహిస్త ఖానమ్ ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు జేఎన్‌టీయూ అధికారులు గోల్డ్‌మెడల్ ప్రకటించారు. 2018-22లో జేఎన్‌టీయూలో టాపర్‌గా నిలిచింది. 13వ కాన్వకేషన్‌లో గోల్డ్‌మెడల్ అందించనున్నారు. విద్యార్థిని కాలేజీ డైరెక్టర్ రామలింగారెడ్డి, చైర్మన్ రామమోహన్‌రెడ్డి, నాగమల్లారెడ్డి, ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, అధ్యాపకులు అభినందించారు.

ఆర్‌ఓపీకి చికిత్స అందించకుంటే శాశ్వత అంధత్వం



అవగాహన కల్పిస్తున్న పీఓ శివప్రతాప్

మదనపల్లె : నవజాత శిశువులకు రెటినోపతి ఆఫ్ ప్రిమెచ్యూరిటీ(ఆర్‌ఓపీ) పరీక్షలు నిర్వహించి, సకాలంలో చికిత్స అందించకపోతే శాశ్వత అంధత్వం సంక్రమిస్తుందని జిల్లా ఆర్‌ఓపీ పీఓ శివప్రతాప్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలోని డైక్ భవనంలో ఆర్‌ఓపీ నిర్ధారణ పరీక్షలు, చికిత్సలపై జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, హెల్త్ సబ్‌సెంటర్లు, పీహెచ్‌సీల డాక్టర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రతాప్ మాట్లాడుతూ.. చిన్నవయస్సులోనే బిడ్డకు జన్మనివ్వడం, గర్భిణుల్లో రక్తహీనత, పౌష్టికాహారలోపం, నెలలు నిండకుండానే, తక్కువ బరువుతో జన్మించే పిల్లల్లో ఆర్‌ఓపీ సమస్య అధికంగా ఉంటుందన్నారు. కనుగుడ్డు చాలావేగంగా అటూ ఇటూ తిప్పుతుండటం, కంట్లోని నల్లగుడ్డుపై తెల్ల టిమచ్చలు ఏర్పడటం, పిల్లలు తరచూ చేతితో కళ్లు రుద్దుతుండటం ఆర్‌ఓపీ ప్రధాన లక్షణాలన్నారు. శిశువు జన్మించిన నెలరోజుల్లోనే సమస్యను గుర్తించి సరైన చికిత్స అందించకపోతే.. మూడు, నాలుగు నెలల్లోనే కంటిచూపు శాశ్వతంగా మసకబారుతుందన్నారు. నవజాత శిశువుల్లో ఆర్‌ఓపీ నిర్ధారిత వైద్య పరీక్షలు, చికిత్స అందించేందుకు అరవింద్ ఐ హాస్పిటల్‌తో రాష్ట్రప్రభుత్వం ఒప్పందం చేసుకుందన్నారు. వైద్యులు ఆస్పత్రికి వచ్చే పిల్లల్లో లక్షణాలు గుర్తిస్తే వెంటనే తగిన పరీక్షలు చేసి చికిత్సలకు సిఫారసు చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ లక్ష్మీ, మెడికల్ సూపరిండెంట్ పద్మాంజలిదేవి, ఆర్‌ఎంఓ ప్రసాదరాజు, డైక్ వైద్యులు సురేష్‌రెడ్డి, సీనియర్ వైద్యులు హరగోపాల్, అరవింద్ ఐ హాస్పిటల్ వైద్యులు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ప్రయోజనం



మిరప పంటను పరిశీలిస్తున్న డీపీఎం రామకృష్ణరాజు

నిమ్మనపల్లె : ప్రకృతి వ్యవసాయం రైతుకు అన్నివిధాల మేలు చేస్తుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగ డీపీఎం రామకృష్ణరాజు అన్నారు. శుక్రవారం ఆయన మండలపరిధిలోని రాచవేటివారిపల్లె పంచాయతీ ఎగువమాచిరెడ్డిగారిపల్లెలో ప్రవల్లిక, రాజేష్ దంపతులు సాగుచేస్తున్న ప్రకృతి వ్యవసాయ మిరప పంటను పరిశీలించారు. పంటసాగు విధానాలను అడిగి తెలుసుకున్నారు. వారు అవలంబిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పరిశీలించారు. పంట మేలైన దిగుబడికి అవసరమైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం చేస్తే రైతులకు పెద్ద ఎత్తున వ్యవసాయఖర్చులు ఆదా అవుతాయన్నారు. రసాయనిక ఎరువులపై పెట్టే పెట్టుబడి మొత్తం రైతుకు మిగులుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు మంచి డిమాండ్ ఉంటుందన్నారు. మార్కెట్లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ కన్సల్టెంట్ సురేంద్రరెడ్డి, సిబ్బంది పవన్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాబ్‌ల పంపిణీ

కురబలకోట: మండలంలోని ముదివేడు మోడల్ స్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు ఎంపీపీ బి. దస్తగిరి, మండల ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్ రెడ్డి, కన్వీనర్ క్రాస్ నారాయణరెడ్డి, నాయకులు అంజాద్ ఖాన్ శుక్రవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. సీఎం జగన్ విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. ప్రపంచ స్థాయిలో రాష్ట్ర విద్యార్థులు రాణించాలన్న లక్ష్యంతో రెండో ఏడాది కూడా ట్యాబ్‌లను అందజేశారన్నారు. విద్యార్థులు వినియోగించుకుని చదువు సంధ్యల్లో రాణించాలన్నారు. ఫజరుల్లా, ఆర్సీ ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' పకడ్బందీగా నిర్వహించాలి

రామసముద్రం: ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ నారాయణస్వామి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వలంటీర్లు , పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26 నుంచి ప్రతి గ్రామంలో క్రీడా పోటీలు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

చెన్నకేశవాలయం పరిశీలన



ఆలయ ఆవరణలో స్థానికులతో మాట్లాడుతున్న ఈఓ మంజుల

కలికిరి: మండలంలోని గుండ్లూరులో వెలసిన పురాతన శ్రీచెన్నకేశవస్వామి ఆలయాన్ని దేవాదాయశాఖ ఎగ్జిక్యూటివ్ అధికారి మంజుల శుక్రవారం పరిశీలించారు. ఆలయం పురాతన చరిత్ర కలిగి ఉండటం, గర్భగుడిలో చెన్నకేశవస్వామి మూల విగ్రహం తిరుమల శ్రీవారి విగ్రహాన్ని పోలి అదే స్థాయిలో ఉండటం ఆలయంలో ప్రత్యేకత. ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో అద్దవారిపల్లికి చెందిన దాత వేణుగోపాల్ రెడ్డి ఆలయ జీర్ణోద్ధరణకు శ్రీకారం చుట్టారు. గ్రామస్తుల సహకారంతో సొంత నిధులతో ఆలయ అభివృద్ధి పనులు చేపట్టారు. పరిశీలన నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

కోవిడ్ సన్నద్ధతపై జిల్లా ఆస్పత్రిలో మాక్ డ్రిల్



మదనపల్లె: ఆక్సిజన్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ పద్మాంజలిదేవి, వైద్యులు



తంబళ్లపల్లె: వైద్య సిబ్బందికి కోవిడ్‌పై సూచనలు ఇస్తున్న మెడికల్ ఆఫీసర్ వెంకట్రామయ్య

మదనపల్లె : దేశంలోని పలు ప్రాంతాల్లో కరోనా జెఎన్.1 కొత్త వేరియంట్ కేసులు వెలుగుచూస్తున్న నేపథ్యంలో చికిత్సలు అందించేందుకు ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. కొవిడ్ బాధితులకు చికిత్స అందించేందుకు, నిర్వహణ సంసిద్ధతను తెలుసుకునేందుకు జిల్లా ఆస్పత్రిలో సౌకర్యాలపై శుక్రవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆసుపత్రిలో పడకల సామర్థ్యం, ఐసోలేషన్, ఆక్సిజన్ వసతి ఉన్న బెడ్‌లు, వెంటిలేటర్, ఐసీయూ బెడ్‌ల వివరాలను మాక్‌డ్రిల్‌లో సేకరించారు. అందుబాటులో ఉన్న వైద్యసిబ్బంది, అంబులెన్స్‌ల వివరాలను తెలుసుకున్నారు. దీంతో పాటు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో పరీక్షా కేంద్రాలు, ఆర్టీపీసీఆర్ పరీక్షలు, కిట్ల లభ్యత, పీపీఈ కిట్లు, ఆక్సీమీటర్‌లు, ఎన్-95మాస్కులు, వెంటిలేటర్ల సంఖ్య వంటి కీలకఅంశాలను గుర్తించి వైద్యారోగ్యశాఖకు నివేదిస్తామని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్.పద్మాంజలి తెలిపారు. పక్క రాష్ట్రాల్లో కోవిడ్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో మన ప్రాంతంలోనూ కేసులు పెరిగితే చికిత్సకు జిల్లా ఆస్పత్రిని సిద్ధంగా ఉంచేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పరిశీలించారు. మాక్ డ్రిల్‌ను మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్.పద్మాంజలిదేవి, ఆర్‌ఎంఓ ప్రసాదరాజు పరిశీలించారు.

తంబళ్లపల్లెలో మాక్ డ్రిల్

తంబళ్లపల్లె: స్థానిక వైద్యవిధానపరిషత్ ప్రభుత్వ ఆసుపత్రిలో కొత్త వేరియెంట్‌పై మాక్‌డ్రిల్ నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ వెంకట్రామయ్య, కొత్త వేరియెంట్ నివారణకు ముందస్తు చర్యలలో భాగంగా వైద్య సిబ్బంది సంసిద్ధంగా ఉండాలన్నారు. కోవిడ్ వార్డులో ఆక్సిజన్, బెడ్లు ఏర్పాటు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ల్యాబ్‌టెక్నిషియన్లు కోవిడ్ పరీక్షల నిర్వహణ తీరును ప్రయోగాత్మకంగా వివరించారు. కోవిడ్ బాధితులను ఆదుకునేందుకు అన్ని రకాల సౌకర్యాలతో వార్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ తేజశ్వి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గణిత మేధావి శ్రీనివాస రామానుజన్



గణిత దినోత్సవంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

మదనపల్లె సిటీ: శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, చంద్రాకాలనీ మున్సిపల్ పాఠశాలల్లో శుక్రవారం గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణంలోని శ్రీనివాస రామానుజన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. హెచ్‌ఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ గణితశాస్త్రానికి శ్రీనివాస రామానుజన్ చేసిన సేవలను కొనియాడారు. ఆయను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరు గణిత శాస్త్రంలో రాణించి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని అన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులు తయారు చేసిన వివిధ గణిత ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఉత్తమ ఎగ్జిబిట్లు ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మునిరాజ, మహమ్మద్‌ఖాన్, వరప్రసాద్ పాల్గొన్నారు.

నిమ్మనపల్లె : ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని జెడ్పీహైస్కూల్‌లో ఉపాధ్యాయబృందం ఘనంగా నిర్వహించారు. జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా ఏపీ కాస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులు గణితంపై క్విజ్ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వెంకటగోపాల్, రేణుక, కుళ్లాయిరెడ్డి,రమణప్ప, రెడ్డిశేఖర్,రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పీలేరు రూరల్ : గణిత రంగానికి విశిష్ట సేవలందించిన శ్రీనివాస రామానుజన్ ప్రపంచంలోనే అద్భుతమైన గణిత మేధావి అని హెచ్‌ఎం గంగాధరం అన్నారు. శుక్రవారం శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని జంగంపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు గణితశాస్త్ర నమూనాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.వి. రమణ, రామ్మూర్తి, రేణుక, వెంకటరమణ, శిరీష, ఎన్. రమణయ్య, ఆనందరాజు, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

వాల్మీకిపురం: గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మ్యాథ్స్ మోడల్స్ ఎగ్జిబిషన్, క్విజ్, గణిత శాస్త్రవేత్తల జీవిత చరిత్రపై వకృత్వ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేసినట్లు హెచ్‌ఎం సావిత్రి తెలిపారు.

పెద్దతిప్పసముద్రం: స్థానిక మోడల్ స్కూల్‌లో శుక్రవారం గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేసినట్లు ప్రిన్సిపాల్ శివకుమారి తెలిపారు.

కలికిరి: విద్యార్థులు గణితం పట్ల భయం కాకుండా మక్కువ పెంచుకున్నట్లయితే సులభతరంగా నేర్చుకోవచ్చని ఎంఈఓ కరీముల్లా అన్నారు. గణిత పితామహుడు రామానుజన్ జయంతి సందర్భంగా శుక్రవారం కలికిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయి గణితం క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మెన్ నల్లారి తిమ్మారెడ్డి, ఎంఈఓ-2 నాగార్జున, సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, హెచ్‌ఎంలు సంపత్‌కుమార్, సోమశేఖర్ పాల్గొన్నారు.